క్లుప్తంగా

హస్నాబాద్ పశువైద్యుడిగా అశోక్ రెడ్డి



దుద్యాల్: హస్నాబాద్ పశువైద్యుడిగా అశోక్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం సకాలంలో వైద్యం అందజేస్తానన్నారు. బంట్వారం పశువైద్యులుగా ఉన్న ఆయన హస్నాబాద్‌కు డిప్యూటేషన్‌లో వచ్చినట్లు తెలిపారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ముదిగిండ్ల కృష్ణ

దుద్యాల్: హస్నాబాద్ గ్రామంలోని చింతల్లమైసమ్మ దేవాలయ ఆవరణలో ఎంపీ నిధులతో శనివారం హైమాస్ట్ లైట్లను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ముదిగిండ్ల కృష్ణ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోనాలు సందర్భంగా ఆలయ ఆవరణలో చీకటి ఉంటుందని గుర్తించి ఎంపీ డీకే అరుణను కోరగా వెంటనే హైమాస్ట్ లైట్లను మంజూరుచేయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ముదిగిండ్ల వెంకటయ్య, బాలగౌడ్, రాజు, హన్మంతు, ఆశప్ప, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో శనివారం దివ్యాంగులకు అందజేసే ఉపకరణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ మేరకు 210 మందికి సంబంధించిన ధ్రువపత్రాలను జిల్లా కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. అర్హత కలిగి, ఎంపికైన వారికి త్వరలోనే ఉపకరణాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో మానవ మనుగడ

ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల



అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ ప్రమీల

మర్పల్లి: మొక్కలతో మానవ మనుగడ సాధ్యమని ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల పేర్కొన్నారు. వన మహోత్సవం పురస్కరించుకొని శనివారం పాఠశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవరాసులు, మానవ మనుగడకు చెట్లు అవసరమన్నారు. పాఠశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు తమ ఇళ్ల ముందు కనీసం 5 మొక్కలు నాటాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టలో రాకంచర్ల కీర్తనలు

పూడూరు: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి సన్నిధిలో పూడూరు మండలం పెద్ద ఉమ్మెంతాల్ పీఠాధిపతి వెంకటదాసు పంతులు రాకంచర్ల కీర్తనలు పారాయణం చేశారు. మండల పరిధిలోని భజన మండలి సభ్యులు 5 రోజుల పాటు యాదగిరీశ్వరుని సన్నిధిలో 500లకు పైగా రాకంచర్ల కీర్తనలు సామూహికంగా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి బృందం సభ్యులు గోరైంక బుచ్చన్న, సత్యనారాయణ, మీనెపల్లి తిర్మలయ్య, కంకల్ మల్లేశ్, నర్సింహారెడ్డి, మంచన్‌పల్లి మల్‌రెడ్డి, గొంగుపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

షాపుల నిర్వహణ తప్ప మిగిలిన సేవలన్నీ బంద్

అనంతగిరి: హైకోర్టు తీర్పును గౌరవిస్తూ తమ వృత్తికి జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ, నెల రోజులు జిల్లా వ్యాప్తంగా కటింగ్ దుకాణాల నిర్వహణ తప్ప మిగితా సంప్రదాయ సేవలన్నింటిని నిలిపివేస్తున్నట్లు నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ఎవరి ఇంటికి వెళ్లి పురుడు పోయమని, పుట్టెంట్రుకలు తీయ మని, ఏ శ్మశాన వాటికకు వెళ్లి గుండు చేయమని, మైలప్రోలు తీయమని పేర్కొన్నారు. జిల్లాలో ఎవరి ఇంట్లో పుష్పవతి అయినను గోర్లు తీయమని, పురుడు చేయమని వివరించారు. సన్నాయి నాదస్వరం వాయించమని పేర్కొన్నారు.

ఉపాధి కూలీలకు కొత్త విధానం

- ఫొటోలతో హాజరు నమోదు
- రెండు పూటలా అప్‌లోడ్ చేయాలి
- ఒకసారి చేస్తే సగం కూలి
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దౌల్తాబాద్: ఉపాధి హామీ చట్టం హాజరునమోదు కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఇక నుంచి ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు ఉదయం, మధ్యాహ్నం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు తీసుకొచ్చారు. రెండు పూటలా కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేస్తేనే పని చేసిన వ్యక్తికి పూర్తి కూలి అందనుంది.

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో..

ఉపాధి హామీ పథకంలో హాజరు విధానాన్ని ఆన్‌లైన్ ద్వారా చేపట్టింది. కేంద్రం తీసుకొచ్చిన ఈ విధానం నేషనల్ మొబైల్ మానిటరింగ్‌సిస్టం యాప్ ద్వారా ప్రతీరోజు కూలీల ఫేస్ రికగ్నైజేషన్ చేసి హాజరు తీసుకుంటారు. గతంలో పనికి ఆలస్యంగా వచ్చినా, ముందు వచ్చినా సమానంగా కూలి తీసుకునే వారని, గత హాజరు విధానాన్ని దుర్వినియోగపరుస్తున్నట్లు కేంద్ర మంత్రిత్వశాఖ దృష్టికి వెళ్లింది. దీంతో ఇటువంటి మోసాన్ని అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టారు. ఉపాధి హామీలో కొత్తగా ప్రవేశపెట్టిన హాజరు విధానాన్ని గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి నుంచి రాష్ట్ర స్థాయిలో కమిషనర్ వరకు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. తీసిన ఫొటోలను మండల స్థాయిలో అధికారుల ఆదేశాల మేరకు ఫొటోలను డీఆర్‌డీఏకు కలెక్టర్‌కు పంపించాల్సి ఉంటుంది.

వ్యతిరేకిస్తున్న కూలీలు

ఉపాధి హామీ నూతన హాజరు విధానాన్ని కూలీలు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయంలో రెండు పూటలా ఫొటోలుతీయాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని చెబుతున్నారు. ఈ నిబంధనను అటు కూలీలతో పాటు ఉపాధి హామీ సిబ్బంది కూడా వ్యతిరేకిస్తున్నారు. ఈ కొత్త హాజరు విధానం వల్ల ఉపాధి పనులకు హాజరయ్యే వారి శాతం తగ్గిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

బీసీ గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి

బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బీసీ సంఘం నాయకులు

తాండూరు టౌన్: బీసీ గురుకులాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన పలువురు బీసీ నాయకులతో కలిసి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. బోధన, వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కిచెన్, బియ్యం, గదులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోధన, భోజనం, ఇతర వసతులు కల్పించాలని ప్రిన్సిపాల్ నరేశ్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ గురుకులాల్లో సీట్లు రాని వేలాది మంది విద్యార్థులు బడి బయట ఉన్నారని, కేవలం వందల సంఖ్యలో మాత్రమే సీట్లు కేటాయించడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గురుకులాల్లో 50 శాతం మేర సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులకు తగిన విధంగా భవన నిర్మాణం, ప్రహరీ, డైనింగ్ హాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సొంత భవనాలు, డైనింగ్‌హాల్ తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షకూర్, వెంకటేశ్, లక్ష్మణాచారి, నవీన్, బస్వరాజ్, రాజుగౌడ్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐల బదిలీ

తాండూరు రూరల్: గౌతపూర్ గ్రామ శివారులోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ విఠల్ రెడ్డిని వికారాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా అతని సేవలను మండల ప్రజలు కొనియాడారు. పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్ వర్ధన్‌ను కొడంగల్ ఎస్ఐ 2గా బదిలీ చేశారు.

ధారూరు ఎస్ఐగా ఎస్ రాఘవేందర్



ధారూరు: ధారూరు నూతన ఎస్ఐగా సున్నం రాఘవేందర్ శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి. అనిత వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎస్ఐగా సున్నం రాఘవేందర్‌ను నియమించారు.

శ్రీజగద్గురు నిరంజన మఠంలో పూజలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని అతి పురాతనమైన శ్రీజగద్గురు నిరంజన మఠంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది శ్రీబసవలింగేశ్వర స్వామివారికి శ్రావణ మాసంలో ప్రతిరోజు రుద్రాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వీరశైవ సమాజం సభ్యులు తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఆగస్టు 23వరకు ప్రతీరోజు ఉదయం 7.30గంటల నుంచి 9.30గంటల వరకు శ్రీస్వామివారికి రుద్రాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. అభిషేకం చేయించే భక్తులు మఠం పూజారి విజయకుమార్‌స్వామి, గడ్డ చంద్రశేఖర స్వామి 63020 44702, 93810 69764 ఫోన్ నబంర్లపై సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పరిగి: తుంకుల్‌గడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునితా పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కామర్స్, ఇంగ్లీష్, తెలుగు, హిస్టరీ, గణితం, పొలిటికల్ సైన్స్, జంతుశాస్త్రం సబ్జెక్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పీజీలో 55శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



ఓటు వినియోగించుకుంటున్న విద్యార్థులు



మర్పల్లి: ఓటు వేస్తున్న విద్యార్థిని

తాండూరు టౌన్: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో హెడ్‌బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్నికలో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే ప్రజాస్వామ్యం, ఓటు హక్కు విలువ, ఎన్నుకునే పద్ధతులు, నాయకత్వ లక్షణాలను పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి ఏటా ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సతీశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

మర్పల్లి: ప్రతిఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని మర్పల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల పేర్కొన్నారు. మర్పల్లి ఆదర్శపాఠశాలలో విద్యార్థుల ప్రతినిధిగా ఎన్నుకునేందుకు ఓటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఓటు వజ్రాయుధం లాంటిదన్నారు. ఓటుతో తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి

ఎంఈఓ వెంకట్




మెట్టుగడ్డతండా పాఠశాలలో విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దోమ: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకుంటే జీవితంలో ఉన్నతమైన స్థానాలను అధిగమిస్తారని ఎంఈఓ వెంకట్ తెలిపారు. శనివారం దోమ మండల పరిధిలోని కిష్టాపూర్, రాకొండ, మెట్టుగడ్డ తండా పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠ్యాంశాలను శ్రద్ధతో వింటూ మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అనంతయ్య, రఘుపతిరెడ్డి, సత్యనారాయణ, కాంప్లెక్స్ సీఆర్‌పీ రెడ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకోసం సైనికుల్లా పనిచేయాలి

చౌడాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్

కుల్కచర్ల: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయంకోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్, పుర్సంపల్లి, మక్తవెంకటాపూర్, మందిపల్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను నూతనంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేదిశగా గ్రామ కమిటీలను ఎంపికచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, నాయకులు నర్సింహ రెడ్డి, దామోదర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, సాయిముదిరాజ్, వెంకటయ్య గౌడ్, సలీం, సత్యకుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పుర్సంపల్లిలో నూతన కమిటీకి బాధ్యతలు అప్పగిస్తున్న నేతలు

దాడులకు పాల్పడే వారిని శిక్షించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప



డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

పరిగి: దళితులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప పేర్కొన్నారు. శనివారం పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్ మండలంలోని పర్సాపూరంలో దళితులను బెదిరించి ఓ కాంట్రాక్టర్ భూమిని అక్రమంగా లాక్కున్నారన్నారు. రేగడిమైలారం, దుద్యాల గ్రామంలో కూడా అక్రమంగా లాక్కున్నారన్నారని డీఎస్పీ దృష్టికి తెచ్చారు. మిట్టకోడూర్ గ్రామంలో దళిత మహిళను అగ్రవర్ణాల వారు కులం పేరుతో దూషించిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో నిందితులపై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని వినతిప్రతంలో సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు చంద్రయ్య, రమేశ్‌బాబు, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడుతున్న పాఠశాల గదులు

- కొనసాగుతున్న తరగతులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



తరగతిగదిలో కూర్చున్న విద్యార్థులు

దౌల్తాబాద్: తిర్మలాపూర్ గ్రామంలోని పాఠశాల గదులు పెచ్చులూడి కనిపిస్తున్నాయి. అక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో 1నుంచి 5 తరగతులకుగాను పాత శిథిలావస్థ భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇదే గదిలో అంగన్‌వాడీ కూడా కొనసాగిస్తున్నారు. కర్నాటకకు సరిహద్దులో ఉన్న ఈ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. సీఎం నియోజకవర్గమైనా పాఠశాల భవనం ఇలా ఉంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో తక్షణమే అధికారులు స్పందించి నూతన భవనాన్ని మంజూరు చేయించాని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చిట్యాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో సంఘం నాయకులు

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బుగ్గయ్య

పరిగి: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని మండల అధ్యక్షుడు బుగ్గయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిట్యాల, సయ్యాద్‌మల్కాపూర్, జాఫర్‌పల్లి, తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా, ఉపాధ్యాయుల సమస్యలపై తాము పోరాడి ఎన్నో హక్కులు సాధించుకున్నామన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రాకేశ్, నాయకులు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, భీమయ్య, సాయిలు, శ్రీను, సుధాకర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

- మునిగిన పంట
- ఇబ్బందుల్లో రైతు
- పట్టించుకోని అధికారులు



సిరిగిరిపేట్ గ్రామ శివారులో నీట మునిగిన పంట

తాండూరు రూరల్: రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఓ రైతు పొలంలో వర్షం నీరు చేరింది. వివరాలు ఇలా ఉన్నాయి..తాండూరు మండలం అల్లాపూర్ గ్రామం నుంచి సిరిగిరిపేట్ గ్రామం వరకు లింక్‌రోడ్డు మంజూరైంది. వాటి పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ ఈ పనులు మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో రోడ్డుకు ఇరువైపులా కాల్వలు తవ్వించాడు. అయితే ప్రస్తుతం కాల్వల్లో మట్టి పేరుకపోవడం వల్ల అవి మూసుకపోయాయి. దీంతో సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన బిచ్చిరెడ్డి కంది, పెసర పంటల్లో వర్షాపు నీరు చేరి మునిగిపోయాయి. దీనికి బాధ్యుడైన కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు పనులు పర్యవేక్షించకపోవడంతోనే కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని గ్రామస్తులు మండిపడుతున్నారు.

జెండా ఏర్పాటుకు భూమిపూజ

ధారూరు: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద 30 ఫీట్ల జెండా ఏర్పాటు కోసం శనివారం బీజేపీ నాయకులు భూమి పూజ నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచన మేరకు ఈ జెండాను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాజునాయక్, బీజేపీ నాయకులు మాధవరెడ్డి, యాస్కి శిరీషా, వివేకానందరెడ్డి, రాజేందర్‌గౌడ్, నెల్లి విశ్వనాథం, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి, మండల అధ్యక్షుడు శేఖర్
- నూతన రేషన్ కార్డుల పంపిణీ



దుద్యాల్: రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

దుద్యాల్: అర్హులకే సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుటి శేఖర్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..10 ఏళ్లుగా అర్హులకు రేషన్ కార్డులు పంపిణీ చేయలేదన్నారు. రేషన్ కార్డు ద్వారా తీసుకున్న బియ్యాన్ని అమ్ముకోవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ దీన్ని సద్వినియోగించుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పూర్తి స్థాయిలో మద్దతివ్వాలని మండల నాయకులు కోరారు. అనంతరం మండల వ్యాప్తంగా 19 కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ వీరేశ్ బాబు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ ఖలీల్ పాషా, యాదవ సంఘం మండల అధ్యక్షుడు నర్సిములు, పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం చైర్మన్ జయరాములు, మండల సీనియర్ నాయకులు మొగులప్ప, శ్రీశైలం, కృష్ణ, సత్యనారాయణ, వెంకటయ్య, రమేశ్‌గౌడ్, నరేశ్, మండల డీలర్లు రవీందర్, నర్సిములు, రాహిల్, పద్మ, మోహన్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

దౌల్తాబాద్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మండల అధ్యక్షుడు వెంకట్రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో కొత్తగా మంజూరైన 260 రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి పేదలు రేషన్‌కార్డులు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు గాయత్రి, డీటీ చాంద్‌పాషా, నాయకులు వీరన్న, విజయ్‌కుమార్, నరోత్తంరెడ్డి, దస్తప్ప, నర్సిములు, ఇండాపూర్‌నర్సిములు, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం

పూడూరు: కాంగ్రెస్ పాలనలో అర్హులందరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని డీసీసీ కార్యదర్శి అజీంపటేల్ తెలిపారు. మండల పరిధిలోని మన్నేగూడలో 200 మందికి రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక్క రేషన్‌కార్డు, ఇల్లు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలమణి, ఖలీల్, సిరాజ్, జాహెద్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు, అధికారులు



పూడూరు: మన్నేగూడలో రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు